W W W.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక



ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

1-12-2025



08

# క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

- క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత
- సింగరేణి చైర్మన్ బలరాం
- గెలుపొందిన విజేతలకు బహుమతులు
- విజయవంతంగా ముగిసిన కబడ్డీ పోటీలు

క్రీడా పోటీలతో సంపూర్ణ ఆరోగ్యం లభించడంతో పాటు ఉత్సాహాన్నిస్తుందని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం అన్నారు. సింగరేణి కాలరీస్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రుద్రంపూర్ ప్రొఫెసర్ జయ శంకర్ స్టేడియం నందు మూడు రోజులపాటుగా జరిగిన కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది.




# ఖమ్మంపై తుఫాను పంజా

- అన్నదాతకు తప్పని అగ్నిపరీక్ష
- ఖమ్మం రైతాంగానికి రెడ్ అలర్ట్
- లక్షా 50 వేల ఎకరాల వరిపై 'గాలి' వాన ఎఫెక్ట్
- కోతలు ఆపండి, అప్రమత్తంగా ఉండండి
- డిసెంబర్ 2 వరకు అత్యవసర పరిస్థితి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తెలుగు రాష్ట్రాల వాతావరణ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసింది. ఒకవైపు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాలను ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) ముంచెత్తుతుండగా, ఆ ప్రభావం తెలంగాణ సరిహద్దు జిల్లాలపై తీవ్రంగా పడుతోంది. ముఖ్యంగా వ్యవసాయమే ప్రధాన వనరుగా ఉన్న ఖమ్మం జిల్లాపై ఈ తుఫాను ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి ప్రకృతి పగబట్టడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

04



10

# హోరా హోరీ

## ఖమ్మంలో ఆరుగురికి తగ్గని పోటీ

- రెండో దశకు పెరిగిన ఉత్కంఠ!
- హాట్‌స్పాట్స్‌లో అభ్యర్థుల భారీ క్యూ
- 4,500 దరఖాస్తులతో స్థానిక సమరం
- వార్డు సభ్యుల పదవులకు రెట్టింపు పోటీ

పటిష్టమైన స్థానిక సంస్థల పాలన దిశగా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఉద్ధృతి తారాస్థాయికి చేరింది. ఖమ్మం జిల్లాలో తొలి విడత నామినేషన్ల ఘట్టం అసాధారణ రికార్డులను సృష్టించి, ఈ సమరం కేవలం ఎన్నిక కాదు, ప్రజాస్వామ్య మహా సంగ్రామం అని నిరూపించింది. ఈ ఉత్సాహం ఏమాత్రం తగ్గకుండానే, రెండో దశ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామాలలో కొత్త ఉద్రిక్తత, ఉత్సాహం చోటు చేసుకుంది. ఈ రెండవ దశ నామినేషన్ల ప్రక్రియ ఆదివారం నుంచి డిసెంబర్ 2 వరకు మూడు రోజుల పాటు జరగనుంది.

ఖమ్మం బ్యూరో, మహా

### హాట్‌స్పాట్స్‌లో యుద్ధ వాతావరణం

మండలాల వారీగా నామినేషన్ల దాఖలును విశ్లేషిస్తే, రఘునాథపాలెం మండలం అగ్రస్థానంలో నిలిచింది. ఇక్కడ 37 గ్రామ పంచాయతీలకు గాను, మొత్తం 254 నామినేషన్లు దాఖలయ్యాయి. దీనికి కొంచెం వెనుకనే కొణిజర్ల మండలం (27 జీపీలు) మొత్తం 194 నామినేషన్ల తో నిలిచింది. సర్పంచ్ పదవులతో పాటు, 1,740 వార్డు సభ్యుల పదవులకు కూడా ఊహించని స్పందన కనిపించింది. మొత్తం నామినేషన్ల సంఖ్య 4,054కి చేరగా, చింతకాని మండలం (626 నామినేషన్లు), కొణిజర్ల (632 నామినేషన్లు) వార్డు ఎన్నికల్లో నయా హాట్‌స్పాట్‌లుగా మారాయి. ప్రతి స్థానానికి ఇద్దరికి పైగా అభ్యర్థులు పోటీ పడుతుండటం, క్షేత్ర స్థాయిలో ఈ ఎన్నికల పట్ల ఉన్న పట్టుదలను స్పష్టంగా చాటుతోంది.

### డిసెంబర్ 11న తుది తీర్పు

రెండో దశ నామినేషన్ల సమర్పణకు స్వల్ప గడువు ఉన్నప్పటికీ, జిల్లా ఎన్నికల యంత్రాంగం పారదర్శ కంగా, సజావుగా ఈ ప్రక్రియను నిర్వహిం చడానికి సిద్ధంగా ఉంది. డిసెంబర్ 3న నామినేషన్ల పరిశీలన, 4న అభ్యంతరాలు/ వినతులు స్వీకరణ ఉంటుంది. ముఖ్యంగా, డిసెంబర్ 11న పోలింగ్ అనంతరం వెంటనే ఫలితాలను ప్రకటించడం ద్వారా సర్పంచ్ స్థానాలు, వార్డుల భవితవ్యం తేలనుంది.



# బ్లడ్ రోడ్స్!

- అతివేగమే హంతకుడు
- 11 నెలల్లో 781 ప్రమాదాలు, 279 మరణాలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రక్తమోడుతున్న రోడ్లు!
- ఈ ఏడాది 279 కుటుంబాల్లో చీకటి నింపిన రోడ్డు ప్రమాదాలు
- పెరుగుతున్న గణాంకాలు.. భద్రత గాల్లో దీపం
- రోడ్డుపై నరకం చూపిస్తున్న డ్రైవర్ల నిర్లక్ష్యం

07

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం రోడ్డు భద్రత అనేది తీవ్రమైన చర్చనీయాంశంగా మారింది. జిల్లా రోడ్లు ఇప్పుడు 'రక్త దారుల'ను తలపిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ 25వ తేదీ వరకు నమోదైన రోడ్డు ప్రమాదాల సంఖ్య దిగ్భ్రాంతి కలిగిస్తోంది.

మహా పత్రిక
ANN తెలుగు



# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు వేదికగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

- ప్రారంభానికి సమగ్ర ఏర్పాట్లు చేయాలి
- అధికారులు క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వర్తించాలి
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోరహదారులు నీటిపారుదల విద్యుత్ రంగాల అభివృద్ధి
- గోదావరి జలాలను ప్రతి ఎకరకు చేరవేసే దిశగా అడుగులు
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల సమీక్షలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు వేదికగా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈనెల 2వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేయనున్న సందర్భంగా నేపథ్యంలో ఆదివారం ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్రంగా పరిశీలించారు. ముందుగా ఆయన శిలాఫలకం ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం యూనివర్సిటీ ప్రాంగణాన్ని పర్యవేక్షించి జరుగుతున్న పనుల పురోగతిని వివరంగా తెలుసుకున్నారు. సభాస్థలాన్ని సందర్శించిన మంత్రి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లపై అధికారుల నుండి వివరాలు తెలుసుకొని సూచనలు ఇచ్చారు. తరువాత యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ భూగోళ శాస్త్రాలు, సహజ వనరులు, ఖనిజ పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా నిలిచే విధంగా దేశంలోనే ప్రత్యేకత కలిగిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని తెలిపారు. గతంలో సింగరేణి నిర్వహించిన "స్కూల్ ఆఫ్ మైన్స్" అనుభవాన్ని గుర్తుచేస్తూ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ స్థాపనకు చేసిన కృషి గురించి వివరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విశ్వవిద్యాలయం లేమి నేపథ్యంలో ప్రత్యేక యూనివర్సిటీ అవసరాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి వెంటనే ఆమోదం తెలపడంతో ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుందని చెప్పారు. కలెక్టర్ జితేష్ పాటిల్ సూచనలతో రూపొందించిన ప్రతిపాదనను ప్రభుత్వం నిపుణులతో ఆరు నెలలపాటు పరిశీలించి సాధ్యతా నివేదిక ఆధారంగా అసెంబ్లీలో ప్రకటించిందని మంత్రి వివరించారు. 'ఖనిజ సంపదలకు పుట్టినిల్లు'గా పేరుగాంచిన కొత్తగూడెం జిల్లా, అరుదైన ఖనిజ సంపద లభ్యమయ్యే ప్రాంతంగా ఉండడంతో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపనకు అత్యుత్తమ ప్రదేశమైందని మంత్రి తెలిపారు. దేశ ఆర్థిక సంస్కరణలకు మార్గదర్శకుడైన, పదేళ్లు భారత ప్రధానిగా పనిచేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ సేవలను గౌరవిస్తూ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని మంత్రివర్గం అసెంబ్లీ దీనిని ఆమోదించాయని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, డాక్టర్ మనోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్ రాజుతో పాటు అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### భవిష్యత్తులో ప్రపంచ స్థాయి పరిశోధనా సంస్థగా యూనివర్సిటీ

జాతీయ రహదారి పక్కనే అభివృద్ధి చెందుతున్న ఈ యూనివర్సిటీ భవిష్యత్తులో ప్రపంచ స్థాయి పరిశోధనా సంస్థగా నిలవనున్నదని అన్నారు. పాల్వంచలో గడువు పూర్తి చేసిన విద్యుత్ పతి కేంద్రాలను తొలగించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపినట్లు తెలిపారు. అలాగే కొత్తగూడెం బైపాస్ రహదారి కోసం 420 కోట్ల రూపాయలతో జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించారని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీలో హాస్టల్ సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలో మంజూరు పొందనున్నట్లు తెలిపారు.

### రహదారులు నీటిపారుదల విద్యుత్ రంగాల అభివృద్ధి

కొత్తగూడెం ఇల్లందు హైదరాబాద్ రహదారి నిర్మాణానికి ఆమోదం లభించగా పనులు ప్రారంభించబడ్డాయని మంత్రి తెలిపారు. భద్రాచలం మణుగూరు ఏటూరునాగారం చౌటాల రహదారి నిర్మాణం కోసం అటవీ శాఖ రెండు లైన్ల రహదారికి అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. పనులు పురోగతిగా ఉన్నాయని చెప్పారు. ఖమ్మం కేంద్రంగా సూర్యాపేట రాజమహేంద్రవరం నాగపూర్ అమరావతి రహదారులు పూర్తి కానున్నాయని వివరించారు. ఖమ్మం భద్రాద్రి జిల్లాల అభివృద్ధి కోసం రింగురోడ్లు కూడా ఆమోదించబడ్డాయని వివరించారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో భాగంగా రహదారులు నీటిపారుదల విద్యుత్ రంగాలలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు మంత్రి వెల్లడించారు.

### ప్రతి ఎకరకు గోదావరి జలాలు...

సీతారామ ప్రాజెక్ట్‌లో భాగంగా డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ నిర్మాణానికి అవసరమైన 3400 కోట్ల నిధులు ముఖ్యమంత్రి ఆమోదించినట్లు వెల్లడించారు. పినపాక మరెళ్లపాడు తుమ్మలచెరువు సింగం భూపాలం అశ్వరావుపేట అన్నదైవంపాడు ముకమామిడి అభివృద్ధితోపాటు డిస్ట్రిబ్యూటర్ కెనాల్ భూసేకరణకు నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా వైరా సత్తుపల్లి మధిర అశ్వరావుపేట కొత్తగూడెం పినపాక నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందనున్నాయని చెప్పారు.

## నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించిన అడిషనల్ డీసీపీ లా, అర్డర్



**ఖమ్మం, మహా:** గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను అదనపు డిసిపి ప్రసాద్ రావు సందర్శించారు. నేలకొండపల్లి, ముజ్జిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. నామినేషన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తుతో నిశితంగా పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రేమ విఫలం నేపథ్యంలో యువతి ఆత్మహత్య



**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట మండల కేంద్రంలో ఆదివారం ఉదయం జరిగిన ఆత్మహత్య ఘటన కలకలం రేపింది. నక్షత్ర (18) అనే యువతి తన ఇంట్లోనే ఉరి వేసుకుని మృతి చెందింది. ఈ ఘటనకు ప్రేమ విఫలమే కారణమని ప్రాంతీయులు చెబుతున్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తితో నక్షత్ర గత సంవత్సరం నుంచి ప్రేమ సంబంధం కొనసాగించినట్లు సమాచారం. వరస సమస్య కారణంగా అబ్బాయి కుటుంబం పెళ్లికి అంగీకరించలేదని, అందువల్ల నిరాశ చెందిన యువతి ఆత్మహత్యకు పాల్పడినట్టు సన్నిహితులు చెప్పారు. మృతురాలికి తల్లి, ఒక సోదరుడు ఉన్నారు. నక్షత్ర మృతి వార్త తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. యువతి మృతి వార్త తెలిసిన ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

## సంఘంపై ఆరోపణలను ఖండిస్తున్నాం




**ఖమ్మం సిటీ, మహా:** తమ యూనియన్ పై తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నామని తెలంగాణ నేషనల్ మజూర్ యూనియన్ రీజినల్ సెక్రెటరీ ఎల్. రామకృష్ణారావు పేర్కొన్నారు. ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22వ తేదీన కార్యాలయం ముందర యూనియన్ కు సంబంధంలేని వ్యక్తులు ధర్నా నిర్వహించి ఆధారాలు లేని ఆరోపణలు చేసిన విషయాన్ని ఖండిస్తున్నామని అన్నారు. దీనిలో భాగంగా ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజురు పేరు మీద ధర్నా చేస్తూ వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఖమ్మం ప్రెస్ మీట్ కార్యక్రమంలో రీజినల్ ప్రెసిడెంట్ ఆర్ టి రావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కే వినాయక రావు, రమేష్, రవీందర్ పాల్గొన్నారు.

## ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు కాంగ్రెస్ ప్రత్యేకత



**మణుగూరు, మహా:** భారత దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్స్ యూని వర్సిటీని జిల్లాలో ఏర్పాటు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యేకతని.., ఇది భూశాస్త్ర ఆధారిత పరిశోధనల భవిష్యత్తుకు పునాదిలాంటిదని పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవంకు సీఎం రేవంత్ రెడ్డి రానున్న నేపద్యంలో ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్, భద్రాద్రి జిల్లాలోని ఇతర ఎమ్మెల్యేలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రంగా ఎదగగలిగే సామర్థ్యంతో ఈ యూనివర్సిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను దేశ విద్యా పటంలో ప్రతిష్టాత్మక స్థానంలో నిలుపుతుందని ఆయన ప్రత్యేకంగా పేర్కొన్నారు. యూనివర్సిటీ యొక్క ముఖ్య ప్రయోజనాలను వివరించారు.

## అనంతారం సర్పంచ్ బరిలో కొర్సా రమేష్

- ప్రజా సేవలో చురుకుగా పాల్గొంటున్న యువ నాయకుడు
- పార్టీ, ప్రజలు ఆశీర్వదిస్తే జన్మభూమి రుణం తీర్చుకుంటానని వెల్లడి



**జూలూరుపాడు, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల గడువు సమీపిస్తున్న వేళ గ్రామాలలో ఆశావాహులు ప్రజలతో మమేకమై పక్కా ఎన్నికల ప్రణాళికతో పావులు కదుపుతున్నారు. మరికొందరు ముందు నుండే గ్రామాలలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నాలు మొదలు పెడితే, మరికొందరు సమస్యల పరిష్కారంతోపాటు, గ్రామంలోని నిరుపేదలకు ఆపాన్న హస్తం అందిస్తూ, అండగా మేముంటామనే భరోసాను కల్పిస్తున్నారు. ఇదే క్రమంలో మండల పరిధి అనంతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కొర్సా రమేష్ పార్టీ ఆదేశిస్తే రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో తలబడనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రమేష్ గ్రామంలో పార్టీ తరపు కార్యక్రమాలతో పాటు, గ్రామ ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ తనకు చేతనైన సహాయ సహకారాలను అందిస్తూ, ప్రజా సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, గ్రామస్తుల మన్ననలు పొందుతున్నాడు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ, ప్రజలు ఆశీర్వదిస్తే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు కేటాయించే నిధులతో పాటు, ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల సహకారంతో మరిన్ని నిధులు తెచ్చి గ్రామాన్ని అన్ని విధాల మరింత అభివృద్ధి చేయడంతో పాటు, గ్రామంలోని అర్హులైన పేద ప్రజలందరికీ ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తానని, గ్రామస్తులందరితో స్నేహ సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేసి, జన్మభూమి రుణం తీర్చుకుంటానని మహా దినపత్రిక ప్రతినిధికి తెలిపారు.

# విధి చిన్నచూపు





- పాపకు తొలి ముద్ద.. నాన్నకు మట్టి ముద్ద
- కూతురి అన్నప్రాశన రోజే ఆగిన తండ్రి గుండె
- గుండెలు పిండేసిన సత్తుపల్లి కానిస్టేబుల్ విషాదం
- సెలవంటూ వెళ్లాడు.. విగతజీవిగా మళ్లాడు

**సత్తుపల్లి, మహా:** విధి రాసిన రాతను ఎవరూ మార్చలేరు అంటారు. కానీ ఆ విధి మరీ ఇంత క్రూరంగా ప్రవర్తిస్తుందా అనిపించే ఘటన ఇది. పండంటి బిడ్డకు తొలిసారి అన్నం తినిపించి, ఆ చిన్నారి చిరునవ్వులు చూసి మురిసిపోవాల్సిన తండ్రి, ఆ వేడుక రోజే విగతజీవిగా మారితే ఆ కుటుంబం పరిస్థితి ఎలా ఉంటుంది? ఊహించడానికే గుండె తరుక్కుపోయే ఈ విషాద ఘటన ములుగు - ఖమ్మం జిల్లాల నడుమ చోటుచేసుకుంది. కూతురి అన్నప్రాశన రోజునే తండ్రి గుండె ఆగిపోవడంతో, ఆ ఇంట మిగిలిన విషాదం చూసి స్థానికులు సైతం కన్నీరుమున్నీరవుతున్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం కంతనపల్లి గ్రామానికి చెందిన పల్లబోయిన హన్మంతరావు తన చిన్నారి కూతురి అన్నప్రాశన వేడుక కోసం ఎన్నో కలలు కన్నాడు. కొన్నాళ్ల క్రితం విజయ అనే యువతిని పెళ్లాడిన హన్మంతరావు, సత్తుపల్లిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ కుటుంబాన్ని పోషించు కుంటు న్నాడు. వీరికి లేకలేక పుట్టిన ఆడబిడ్డ కావడంతో, ఆ పాపకు అన్న ప్రాశన వేడుకను ఘనంగా నిర్వహించాలని భావించాడు. ఇల్లంతా బంధుమిత్రులతో సందడిగా మారింది. కూతురిని కొత్త బట్టల్లో చూసుకుని మురిసిపోయిన హన్మంతరావు, వేడుక ఏర్పాట్లలో చురుగ్గా పాల్గొన్నాడు. అయితే ఆనందంగా సాగిపోతున్న ఆ వేడుకలో మృత్యువు పొంచి ఉందని ఎవరూ ఊహించలేకపోయారు. సాయంత్రం వేళ బయటకు వెళ్లి వస్తానని చెప్పిన హన్మంతరావు, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అప్పటి వరకు నవ్వుతూ కనిపించిన మనిషి అకస్మాత్తుగా నేలకొరగడంతో స్థానికులు వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే జరగరాని ఘోరం జరిగిపోయింది. తీవ్రమైన గుండెపోటు రావడంతో హన్మంతరావు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ వార్త వినగానే అన్నప్రాశన వేడుకలో ఉన్న కుటుంబ సభ్యుల గుండెలు పగిలాయి. భర్త మరణవార్త విన్న భార్య విజయ రోదనలు మిన్నంటాయి. “కూతురి నోటికైతే అన్నం అందించావు కానీ.. మా బతుకుల్లో మట్టి కొట్టావా?” అంటూ ఆమె విలపిస్తున్న తీరు చూసి ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. పండగలా ఉండాల్సిన ఇల్లు ఒక్కసారిగా శ్మశానవైరాగ్యంతో నిండిపోయింది. తండ్రి ప్రేమని పొందే వయసు కూడా లేని ఆ పసికూన, తండ్రి లేని లోకంలోకి అడుగుపెడుతున్నానని తెలియక అమాయకంగా చూస్తుండటం అందరినీ కలిచివేసింది. విధి ఆడిన ఈ వింత నాటకంలో ఒక నిండు ప్రాణం బలికాగా, పచ్చని కుటుంబం ఛిద్రమైంది. హన్మంతరావు మరణం అటు ములుగు జిల్లాలోనూ, ఇటు ఆయన పనిచేస్తున్న సత్తుపల్లి పోలీస్ వర్గాల్లోనూ తీవ్ర విషాదాన్ని నింపింది.

## ఘనంగా గీతా జయంతి వేడుకలు



**మణుగూరు, మహా:** గీతా జయంతి సందర్భంగా బాలాజీ నగర్‌లోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సన్నిధిలో ఆదివారం గీతా జయంతి సందర్భంగా భక్తి శ్రద్ధల నడుమ భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. గురువు నెట్టం రాధాకృష్ణ ఆధ్వర్యంలో భక్తబృందం కలిసి గీతా శ్లోకాలను పఠిస్తూ దైవానుభూతిని అందుకున్నారు. ఈ సందర్భంగా దళిత శ్రీ సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ ప్రాంగణం గీతా జ్ఞానామృతంతో నిండిపోయింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పితాని సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు దొమ్మేటి సత్య ప్రకాష్ దొమ్మేటి రాంబాబు కడలి ఏడుకొండలు, బొక్క వీర్రాజు, సానబోయిన సత్యనారాయణ, చల్లంగి శ్రీనివాస్, ఆలయ పూజారులు నవీన్ కుమార్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి దివ్య కృపకు మనసారా మోక్షం కలగాలని కోరుకున్నారు.

## రెడ్డిగూడెం సర్పంచ్ బరిలో మోదుగు బాలకృష్ణ



**తల్లాడ, మహా :** తల్లాడ మండలంలోని కొడవటి మెట్ట(రెడ్డిగూడెం)గ్రామ పంచాయతీ సర్పంచ్ గా సామాజిక సేవకులు, బహుజన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మోదుగు బాలకృష్ణ పోటీ చేయనున్నారు. సర్పంచ్ పదవి ఎస్సీ జనరల్ కు కేటాయించడంతో ఆయన పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. స్వగ్రామానికి చెందిన బాలకృష్ణ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆర్థికంగా అంచెలంచెలుగా ఎదిగారు. వాటితోపాటు స్వచ్ఛంద సంస్థలు స్థాపించి ఎంతోమంది పేద విద్యార్థులకు, నిరుపేదలకు, అట్టడుగు వర్గాల వారికి సహాయ సహకారాలు అందించారు. అంతేకాకుండా ఇటీవల కాలంలో తల్లాడ మండల వ్యాప్తంగా వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు దుప్పట్ల పంపిణీ చేపట్టి సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా దూసుకెళ్లారు. ఈ నేపథ్యంలో స్వగ్రామానికి సేవ చేయాలనే తలంపుతో ఆయన బరిలో ఉండనున్నట్లు తెలిసింది. ఈ మేరకు డిసెంబర్ మూడో తేదీన ఆయన నామినేషన్ దాఖలు చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ మద్దతు సర్పంచిగా బరిలో ఉంటున్నానని, ప్రజలందరూ అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రామ అభివృద్ధికి తన వంతు సాయంగా ఆర్థికంగా తోడ్పాటు అందిస్తానని ఈ సందర్భంగా బాలకృష్ణ తెలిపారు .

## గిరిజన గ్రామ పంచాయతీలపై గిరిజనేతరుల కుట్ర

### ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ డిమాండ్



**జూలూరుపాడు, మహా:** రాజకీయ లబ్ధి కోసం గిరిజన గ్రామ పంచాయతీల పై గిరిజనేతరులు కుట్రలు చేస్తున్నారని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏవిఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం 1950 నాటినుండి జూలూరుపాడు గ్రామ పంచాయితీతోపాటు, మండలం షెడ్యూల్ ప్రాంతంగా గుర్తించబడిందని తెలిపారు. ఏజెన్సీ చట్టాలు, హక్కుల ప్రకారం ఈ ప్రాంతంలో గిరిజనులకే రిజర్వేషన్ అర్హతను భారత రాజ్యాంగం కల్పించిందని అన్నారు. కానీ గిరిజనేతరులు తమ రాజకీయ లబ్ధికోసం జూలూరుపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికను ఆపుటకు తప్పుడు సమాచారంతో తెలంగాణ హైకోర్టు నుండి ఇంటీరియం ఆర్డర్ తేవడం బాధాకరమన్నారు. ఇది ముమ్మాటికి గిరిజన హక్కులను కాలరాసే కుట్రగా ఈ ప్రాంత గిరిజనులంతా చూడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు కల్పించిన చట్టాలను, అక్కులను కాపాడాల్సిన బాధ్యత న్యాయస్థానాలకు, రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ లాకావత్ నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ రఘు నాయక్, గోర్ బంజారా నాయకులు రాందాస్ నాయక్, దుర్గాప్రసాద్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుశాల్ నాయక్, బంజారా సంఘం హరినాయక్, జీవన్ నాయక్, మాజీ ఎంపీటీసీ రాంజీ నాయక్, లక్ష్మణ్ నాయక్, రాందాస్ నాయక్, రామారావు, వంశీ నాయక్, లక్ష్మణ్ నాయక్, జీవన్ నాయక్, గంగులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మహా పత్రిక
ANN తెలుగు

# ఖమ్మంపై తుఫాను పంజా



- అన్నదాతకు తప్పని అగ్నిపరీక్ష
- ఖమ్మం రైతాంగానికి రెడ్ అలర్ట్
- లక్షా 50 వేల ఎకరాల వరిపై 'గాలి' వాన ఎఫెక్ట్
- కోతలు ఆపండి, అప్రమత్తంగా ఉండండి
- డిసెంబర్ 2 వరకు అత్యవసర పరిస్థితి

**ఖమ్మం బ్యూరో, మహా:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తెలుగు రాష్ట్రాల వాతావరణ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసింది. ఒకవైపు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాలను ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) ముంచెత్తుతుండగా, ఆ ప్రభావం తెలంగాణ సరిహద్దు జిల్లాలపై తీవ్రంగా పడుతోంది. ముఖ్యంగా వ్యవసాయమే ప్రధాన వనరుగా ఉన్న ఖమ్మం జిల్లాపై ఈ తుఫాను ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి ప్రకృతి పగబట్టడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పొరుగు రాష్ట్రంలోని వరద పరిస్థితులు, జిల్లాలో మారిన వాతావరణాన్ని విశ్లేషిస్తూ జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాఖ జారీ చేసిన అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం క్రమంగా తుఫానుగా బలపడి తీరం వైపు దూసుకొస్తుండటంతో వాతావరణం ఒక్కసారిగా అల్లకల్లోలంగా మారింది. దీని ప్రభావం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తూ లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అక్కడ జారీ చేసిన 'ఫ్లాష్ ఫ్లడ్స్' అలర్ట్, సరిహద్దున ఉన్న తెలంగాణ జిల్లాలను సైతం వణికిస్తోంది. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో నవంబర్ 30 నుండి డిసెంబర్ 2వ తేదీ వరకు వాతావరణం అత్యంత ప్రతికూలంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మూడు రోజుల పాటు జిల్లాలో గంటకు 65 కిలోమీటర్ల వేగంతో కూడిన బలమైన ఈదురు గాలులు వీయడంతో పాటు, ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. డిసెంబర్ 3వ తేదీ తర్వాతే పరిస్థితులు కుదుటపడి పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగాన్ని విశ్లేషిస్తే, ప్రస్తుతం వానాకాలం సీజన్ ముగింపు దశలో ఉంది. జిల్లావ్యాప్తంగా దాదాపు 8,05,053 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, ఇందులో సింహభాగం వరి పంటదే. గణాంకాల ప్రకారం సుమారు 1,52,000 ఎకరాల్లో వరి పంట కోత దశలో లేదా కోతకు సిద్ధంగా ఉండటం ఇప్పుడు ఆందోళన కలిగించే ప్రధాన అంశం. సరిగ్గా పంట కోసి ఇంటికి తెచ్చుకునే సమయంలో బలమైన గాలులు, వర్షం ముప్పు పొంచి ఉండటం రైతులను కలవరపెడుతోంది. ఈదురు గాలుల వల్ల పంట నేలకొరిగే ప్రమాదం ఉండటం, వర్షం వల్ల ధాన్యం రంగు మారే అవకాశం ఉండటంతో జిల్లా వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళన చెందకుండా, అధికారుల సూచనలను పాటిస్తూ సంయమనంతో వ్యవహరించాలని కోరుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ శాఖ కొన్ని కీలక సూచనలు జారీ చేసింది. వాతావరణం ఏమాత్రం అనుకూలంగా లేనందున, రైతులు కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను కోయకుండా మరో రెండు, మూడు రోజుల పాటు వాయిదా వేసుకోవడమే ఉత్తమమని తేల్చిచెప్పింది. ఇప్పటికే కోతలు పూర్తి చేసి, ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టిన రైతులు



లేదా కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన రైతులు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఆకస్మిక వర్షాల నుండి ధాన్యాన్ని రక్షించుకునేందుకు నాణ్యమైన టార్పాలిన్లతో పటిష్టంగా కప్పి ఉంచాలని, గాలులకు అవి ఎగిరిపోకుండా బరువులు ఉంచాలని సూచించారు. అలాగే పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే పంట దెబ్బతినే ప్రమాదం ఉన్నందున, ఎప్పటికప్పుడు నీటిని బయటకు పంపేలా ముందస్తు చర్యలు తీసుకోవాలి. పొరుగున ఉన్న ఏపీలో సంభవిస్తున్న ఆకస్మిక వరదలు, మారుతున్న వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఖమ్మం రైతులు ఈ మూడు రోజులు యుద్ధ ప్రాతిపదికన పంట రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సింగరేణిలో కాళీ పోస్టులకు వ్రాత పరీక్ష



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న జూనియర్ సానిటరీ ఇన్స్పెక్టర్(టి అండ్ ఎస్ గ్రేడ్ –డి), జూనియర్ ఇన్స్పెక్టర్(టి అండ్ ఎస్ గ్రేడ్ –డి) పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేసే దానిలో భాగంగా ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ పీజి కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించటం జరిగింది. ఈ వ్రాత పరీక్ష సెక్యూరిటీ విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో సిసి కెమెరాల నిఘా మధ్య నిర్వహించారు. సింగరేణి మహిళా డిగ్రీ పీజి కళాశాలలో జరిగిన ఈ పరీక్షను జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏజేఎం మురళీధర్ రావు, హెచ్‌ఓడి(విజిలెన్స్)పి.రాజీవ్ కుమార్ పర్యవేక్షించారు. ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో ఇంచార్జ్ జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ ఆర్ జివి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏజేఎం మురళీధర్ రావు, హెచ్‌ఓడి( విజిలెన్స్)పి.రాజీవ్ కుమార్, డిజిఎం(పర్సనల్) పి.వేణు గోపాలరావు, డివైపిఎం డి.నాగేశ్వర రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి జాకీర్ హుస్సేన్, విజిలెన్స్ ఆఫీసర్లు ఎండి.గౌసుద్దీన్, బి.సమ్మయ్య, సీనియర్ పిఓ పి.కాంతారావు, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద, ఇతర అధికారులు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం రద్దు

**ఖమ్మం,మహా:** స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా, ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమైనందున ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం తెలిపారు. ఎన్నికలు నిర్వహణలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికముగా రద్దు చేయడం జరిగిందని, ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## సర్పంచ్ అభ్యర్థిగా రోహిణి నామినేషన్

**దమ్మపేట, మహా:** మాజీ ఉపసర్పంచ్ దారా యుగందర్ సతీమణి దారా రోహిణి స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ పదవికి ఆర్.ఓ.అధికారి అక్షిత కు ఆదివారం నామినేషన్ పత్రాలు అందచేశారు. ఎటువంటి ఆర్భాటాలు లేకుండా సాదాసీదాగా నామినేషన్ వేయడంతో పలువురు ఆశ్చర్యచకితులయ్యారు. అధికార పార్టీ సర్పంచ్ అభ్యర్థి గా పగడాల రమా దేవి పై ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి దారా రోహిణి నామినేషన్ వేసిన తీరు పలువురిలో చర్చనీయాంశంగా మారింది. అసలే మేజర్ పంచాయతీ కావడంతో ఇప్పటి వరకు అధికార పార్టీని ఎదుర్కొనకలిగే సత్తా ఉన్న ప్రధాన ప్రతిపక్ష పార్టీ బలపరిచిన అభ్యర్థి నామినేషన్ ప్రక్రియ చాలా సందడి వాతావరణం లో ఉంటుందని ఊహించిన నాయకుల కు అర్థంగాని పరిస్థితి ఎదురైంది. చాలా వ్యూహాత్మక పరిస్థితి లోనే సాదాగా నామినేషన్ కార్యక్రమం చేసినట్లు కొందరు అభిమాన వర్గీయులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా పంచాయతీ కి ఏవిధమైన సేవలు అందిస్తారని "మహా " ప్రతినిధి ప్రశ్నించగా సర్పంచ్ అభ్యర్థి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన గ్రామాభివృద్ధి పనులు చేయడానికోసమే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నానని చాలా సింపుల్ గా సమాదానం ఇచ్చారు. నామినేషన్ సమర్పించే సమయంలో వారి వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు దొడ్డా రమేష్ ,అబ్దుల్ జిన్నా ,పాకనాటి శ్రీనివాస్ ,యార్లగడ్డ శ్రీనివాస్ ,పసుమర్తి రామ భద్రరావు తదితరులు ఉన్నారు.



FOLLOW: @ANNTELUGU
1-12-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# పియంశ్రీ పాఠశాలలో క్రీడలు



**దమ్మపేట, మహా:** స్థానిక (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ) పియంశ్రీ పాఠశాల లో విద్యార్థినీ విద్యార్థుల కు మూడురోజులపాటు క్రీడలు నిర్వహించారు. ప్రతి ఏడాది నిర్వహించే క్రీడల లో భాగంగా ఈ నెల 27 ,28,29 తేదీలలో జూనియర్ కబడ్డీ ,సీనియర్ కబడ్డీ ,వాలీబాల్ ,ఖోఖో ,వంటి క్రీడలు నిర్వహించారు. వాలీబాల్, ఖో ఖో, ఫుట్‌బాల్ , షాట్ ఫుట్,టేబుల్ టెన్నిస్ ,చదరంగం వివిధ పోటీలు బాలబాలికల కు విడివిడిగా నిర్వహించడం జరిగింది. విద్యార్థులను రెడ్, బ్లూ, గ్రీన్, ఎల్లో గ్రూప్ లు గా విభజించి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి ,ఏయంసి కమిటీ చైర్మన్ శ్రీలత ,పి.డి. మల్లేశ్వరరావు ,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖాళీలను గుర్తించి పదోన్నతులు కల్పించాలని వినతి



**మణుగూరు, మహా:** కెరీర్ గ్రోత్ స్కీమ్ అమలులో ఏర్పడుతున్న లోపాలను సరిదిద్దుతూ, ఈపి ఫిట్టర్, ఈపి ఎలక్ట్రీషియన్‌లకు అర్హత కలిగినచోట పదోన్నతులు తక్షణం కల్పించాలని మణుగూరు ఏరియా టిబిజికెయస్ నాయకత్వం డిమాండ్ చేసింది. ఈ మేరకు కార్పొరేట్ ఏజియం (పర్సనల్), ఐఆర్ విభాగం అధికారి కె అజయ్ కుమార్‌కు మణుగూరు ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు అదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018 డిసెంబర్‌లో కెరీర్ గ్రోత్ స్కీమ్ పేరుతో యాజమాన్యం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఏరియాలో ఖాళీగా ఉన్న ఈపి ఫిట్టర్, ఈపి ఎలక్ట్రీషియన్‌ల సి, బి, ఏ గ్రేడ్ పోస్టులను గుర్తించి అర్హులైన ఉద్యోగులతో భర్తీ చేయాలని కోరారు. ఖాళీలను గుర్తించకుండా యాజమాన్యం ఐదు సంవత్సరాల సేవా నిబంధన ఆధారంగా పదోన్నతులను పరిగణలోకి తీసుకోవడం వల్ల మూడు సంవత్సరాలు పూర్తి చేసి అర్హత సాధించిన కార్మికులు అన్యాయానికి గురవుతున్నారని అయిన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, సుద్దాల సంపత్ కుమార్, పికె నాగరాజు స్వామి, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## యుగపురుషుడు పలికిన వేదం





**ఖమ్మం, మహా:** "యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ" ... సత్య సందేశాన్ని విశ్వానికి అందించిన గీతా జయంతి పర్వదినం సందర్భంగా, భక్తి పారవశ్యంలో మునిగితేలిన ఖమ్మం నగరంలో ఒక చారిత్రాత్మక ఆధ్యాత్మిక ఘట్టం ఆవిష్కృతమైంది. గీతోపదేశం ద్వారా జగతికి సన్మార్గం బోధించిన యోగేశ్వరుని స్మరణలో, విశ్వ హిందూ పరిషత్ ఖమ్మం విభాగం ఆధ్వర్యంలో జరిగిన 700 శ్లోకాల సామూహిక భగవద్గీత పారాయణం కనీవినీ ఎరుగని రీతిలో జరిగింది. వేలాది మంది భక్తులు, మూడు గంటల పాటు ఏకకంఠంతో చేసిన ఈ పారాయణ ధ్వని, ఆ ప్రాంతమంతా పవిత్ర జ్ఞాన జ్యోతిని వెలిగించింది. మ్మం నగరంలో నర్తకి సినిమా హాల్ సమీపంలోని శ్రీ మురళీకృష్ణ మందిరం వేదికగా, విశ్వ హిందూ పరిషత్ సారథ్యంలో అత్యంత బృహత్తరమైన ఆధ్యాత్మిక కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. గీతా జయంతిని పురస్కరించుకుని, సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మ అందించిన భగవద్గీతలోని 700 శ్లోకాల పారాయణాన్ని సామూహికంగా నిర్వహించడం ఒక అపురూప దృశ్యం. ఈ మహా పారాయణంలో కేవలం ఖమ్మం నుంచే కాక, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ జిల్లాల నుంచి కూడా దాదాపు 1200 మందికి పైగా కృష్ణ భక్తులు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు.



# కిక్కులో కొత్త లెక్క

- లిక్కర్ సామ్రాజ్యంలో నేటి నుంచే 'రాయల్' ఎంట్రీ!
- సిండికేట్ కోటలో కొత్త దొరల జమానా షురూ.
- పాత సీసా.. కొత్త యజమాని.. నేటి నుంచే అసలైన ఆట!

**ఖమ్మం బ్యూరో, మహా:** డిసెంబర్ 1వ తేదీ రానే వచ్చింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మందు బాబుల నిరీక్షణకు, వ్యాపారుల ఉత్కంఠకు తెరపడబోతోంది. గత కొన్ని రోజులుగా టెండర్లు, లాటరీలు, రిజర్వేషన్లు అంటూ సాగిన హడావుడి ముగిసి, ఇప్పుడు అసలైన వ్యాపారానికి రంగం సిద్ధమైంది. లక్కు చిక్కిన కొత్త యజమానులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతుండగా, ప్రభుత్వం తన ఖజానాను నింపుకుని లైసెన్సులు జారీ చేసింది. రేపటి నుంచి మద్యం షాపుల రూపురేఖలు మారిపోనున్నాయి. పాత బోర్డులు దిగిపోయి, కొత్త బోర్డులు వెలుగొందనున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మద్యం వ్యాపారం ఎలా ఉండబోతోందనేది ఇప్పుడు హాట్ టాపిక్. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మద్యం వ్యాపారం అంటేనే కాసుల వర్షం కురిపించే కల్పవృక్షం. అందుకే ఇక్కడ ఒక్క షాపు దక్కించుకోవడానికి వ్యాపారులు కోట్లు కుమ్మరించడానికి వెనకాడరు. డిసెంబర్ 1వ తేదీ నుంచి నూతన మద్యం విధానం అమల్లోకి వస్తుండటంతో, కొత్తగా లైసెన్సులు పొందిన యజమానులు దుకాణాలను తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఉన్న పాత సిండికేట్లు, పాత పద్ధతులకు స్వస్తి పలుకుతూ నూతన అధ్యాయం మొదలుకానుంది. ముఖ్యంగా గౌడ సామాజిక వర్గానికి 15 శాతం కేటాయింపులు ఉండటంతో, ఈసారి మార్కెట్‌లో కొత్త ముఖాలు, సామాన్య వ్యాపారులు కూడా యజమానులుగా అవతరించడం విశేషం. ఉమ్మడి ఖమ్మం జిల్లా గణాంకాలను ఒక్కసారి పరిశీలిస్తే ఆశ్చర్యం కలగకమానదు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను కలుపుకుని మొత్తం 210 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇందులో ఖమ్మం జిల్లా పరిధిలో 122 షాపులు ఉండగా, ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 88 షాపులు ఉన్నాయి. ఈ దుకాణాలను దక్కించుకోవడానికి వేల సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఒక్కో దరఖాస్తుకు ప్రభుత్వం రూ. 2 లక్షల చొప్పున ఫీజు వసూలు చేయడంతో, కేవలం దరఖాస్తుల రూపంలోనే ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. ఇక రేపటి నుంచి ప్రారంభమయ్యే అమ్మకాల ద్వారా ఎక్సైజ్ శాఖకు పన్నుల రూపంలో ప్రతి నెలా కోట్లాది రూపాయల ఆదాయం రానుంది. గతంలో మద్యం వ్యాపారం కేవలం కొద్దిమంది బడా బాబుల చేతుల్లోనే ఉండేది. సిండికేట్లుగా ఏర్పడి మార్కెట్‌ను శాసించేవారు. కానీ ఈసారి లాటరీ పద్ధతి పారదర్శకంగా జరగడం, రిజర్వేషన్ల అమలుతో చాలా మంది సామాన్యులకు కూడా అదృష్టం వరించింది. అయితే, దుకాణం దక్కించుకున్న తర్వాత లైసెన్స్ ఫీజులు, సరుకు కొనుగోలు, షాపు అద్దెలు, సిబ్బంది ఖర్చులు తడిసి మోపెడవుతాయని కొత్త యజమానులు ఆందోళన చెందుతున్నప్పటికీ, ఖమ్మం వంటి వాణిజ్య కేంద్రంలో మద్యం అమ్మకాలకు ఢోకా ఉండదని ధీమాగా ఉన్నారు. ముఖ్యంగా పండుగ సీజన్లు, పెళ్లిళ్లు, రాజకీయ పార్టీల విందులతో ఇక్కడ లిక్కర్ సేల్స్ ఎప్పుడూ జోరుగానే సాగుతాయి. నేటి నుంచి బాధ్యతలు స్వీకరించనున్న కొత్త యజమానులు, వినియోగదారులను ఆకర్షించేందుకు దుకాణాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

## మణుగూరులో రాధా హాస్పిటల్స్ ఉచిత వైద్య శిబిరం

**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజల ఆరోగ్య రక్షణ లక్ష్యంగా రాధా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాంటిసోరి పాఠశాలలో సిఎస్‌బి బ్యాంక్ సహకారంతో నిర్వహించిన ఈ మెగా హెల్త్ క్యాంప్‌కు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శిబిరంలో ఎండి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మార్తి సాయి మోహన్ యాదవ్, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆలీనా శాంతి ప్రజలకు వైద్యసేవలు అందించారు. బిపి, షుగర్, థైరాయిడ్ వంటి సాధారణ వ్యాధులపై వైద్య పరీక్షలు నిర్వహించగా, దాదాపు 300 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత యూసఫ్ షరీఫ్, సిఎస్‌బి బ్యాంక్





మేనేజర్, బ్యాంకు సిబ్బంది, రాధా హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఆసుపత్రి గోడల మధ్య సమాధి అయిన నమ్మకం

- పుట్టకముందే చనిపోయిన బంధం
- మెరుగైన వైద్యం' పేరుతో నిర్లక్ష్యం
- వైద్యుల 'సాధారణ ప్రసవం' మొండిపట్టు
- ప్రాణం పోగొట్టుకున్న పసిబిడ్డ
- శిశువు మృతిపై తేలని సత్యం
- మా నిర్లక్ష్యం కాదంటున్న డాక్టర్లు

**మణుగూరు, మహా:** ప్రతి తల్లిదండ్రుల జీవితంలో తొలి బిడ్డ రాక ఒక గొప్ప పండుగ. ప్రపంచంలోని ఆనందమంతా తమ ఒడి చేరిందని మురిసిపోతారు. పినపాక మండలానికి చెందిన తోలెం రవికుమార్, అరుణ దంపతులు కూడా అదే కల కన్నారు. ప్రైవేట్ ఆస్పత్రి ఖర్చులకు పోకుండా, తమ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తారని నమ్మారు. కానీ, మణుగూరు వంద పడకల ఆస్పత్రిలో వారికి ఎదురైన అనుభవం, ఆ కలను శాశ్వతంగా సమాధి చేసింది. వారి జీవితంలో కోలుకోలేని విషాదాన్ని, గుండెకోతను మిగిల్చింది. కుటుంబ సభ్యులు ఆవేదనతో చెబుతున్న వివరాల ప్రకారం... ప్రసవ సమయంలో బిడ్డ పరిస్థితి విషమంగా మారుతున్న కీలకమైన ఘట్టంలో, ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స (సిజేరియన్) చేయాలనే సరైన నిర్ణయాన్ని తీసుకోలేదు. బిడ్డ ప్రాణం ప్రమాదంలో ఉందని తెలిసినా, సాధారణ ప్రసవం కోసమే అతిగా ప్రయత్నించారు. ఫలితం... లోకం చూడకముందే ఆ బిడ్డ ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. "సమయానికి సర్జరీ చేసి ఉంటే మా బిడ్డ బతికి ఉండేది. మాకు న్యాయం కావాలి," అంటూ తల్లి అరుణ, తండ్రి రవికుమార్ కన్నీటిపర్యంతమయ్యా రు. ఇది కేవలం వైద్యపరమైన తప్పిదం కాదని, తమ తొలిబిడ్డ ప్రాణాలను తీసిన పచ్చి నిర్లక్ష్యం అని వారు గొంతు ఎత్తి ఆరోపిస్తున్నారు.

### మాది లోపం కాదు..సూపరింటెండెంట్ వివరణ

అయితే, ఆసుపత్రిపై వస్తున్న తీవ్ర ఆరోపణలను మణుగూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ తోసిపుచ్చారు. "శిశువు మరణానికి వైద్యుల నిర్లక్ష్యం ఎంత మాత్రం కారణం కాదు," అని ఆయన స్పష్టం చేశారు. గైనకాలజిస్ట్, పిల్లల డాక్టర్ల పర్యవేక్షణలోనే సాధారణ కాన్పు ప్రయత్నం జరిగిందని, శిశువు బయటికి వచ్చే సమయానికి హార్ట్ బీట్ లేదని ఆయన వివరణ ఇచ్చారు. తమవంతుగా చికిత్స అందించిన తర్వాతనే తదుపరి వైద్యం కోసం భద్రాచలం తరలించామని పేర్కొన్నారు. ఈ ఘటనలో నిజంగా జరిగింది నిర్లక్ష్యమా.. లేక అనివార్యమా అన్నది విచారణ జరిపి, వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవైపు బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రుల కన్నీరు, మరోవైపు వైద్యుల వివరణ .. ఈ రెండింటి మధ్య నలిగిపోతున్న సత్యం త్వరలో బయటపడాలి.

### ప్రాణం పోయినా గుట్టుగా తరలింపు

ఈ ఘటనలో మరింత బాధాకరమైన విషయం ఏంటంటే, శిశువు పుట్టిన వెంటనే మరణించినా, ఆ చేదు నిజాన్ని తల్లిదండ్రుల నుంచి దాచిపెట్టడానికి ఆసుపత్రి సిబ్బంది ప్రయత్నించారని కుటుంబం ఆరోపిస్తోంది. చనిపోయిన శిశువుకు కృత్రిమంగా ఆక్సిజన్ పెట్టి, మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు "ఈ శిశువు చాలా సమయం క్రితమే మృతి చెందింది" అని ధ్రువీకరించడంతో, మణుగూరు ఆసుపత్రి తీరుపై కుటుంబ సభ్యులు భగ్గుమన్నారు. తమ బిడ్డ మరణానికి వైద్యుల నిర్లక్ష్యమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ, న్యాయపోరాటం చేస్తామని దంపతులు స్పష్టం చేశారు.

## నామినేషన్ ల ప్రక్రియలో అలసత్వం.. పోటీలకు వెనుకడుగు

**దమ్మపేట, మహా:** సర్పంచ్ అభ్యర్దులను గేలం వేసి వెతికినా దొరకని పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు పంచాయతీ ఎన్నికలంటే గ్రామాల్లో పండగను తలపించే విధంగా ,ఆహ్లాదకరంగా వాతావరణం కనిపించేది. నేడు ఆ విధమైన వాతావరణం ఊహలకు కూడా ఎక్కడాలేదని చెప్పవచ్చు. మొత్తం మండలంలో 31 గ్రామ పంచాయతీ సర్పంచ్ లకు ,290 వార్డు సబ్యులకు నామినేషన్లు స్వీకరించాల్సి ఉంది. రెండవ ఫేజ్ లో జరిగే పంచాయతీ ఎన్నికల్లో ఇప్పటికే మండల వ్యాప్తంగా 10 నామినేషన్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా ఆదివారం జరిగిన నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థుల నుండి ఆశించిన మేరకు నామినేషన్లు దాఖలు కాలేదు. కేవలం 7 పంచాయతీ లలో మాత్రమే 9 మంది సర్పంచ్ అభ్యర్ధుల కు నామినేషన్లు అందాయి. వాటిలో దమ్మపేట మేజర్ పంచాయతీ లో 2 , ముష్టిబండ లో 2 ,రాచూరుపల్లి లో 2, నాచారం 1 ,పట్వారిగూడెం 1,పెద్దగొల్లగూడెం 1, మాత్రమే సర్పంచ్ పదవికి ప్రస్తుతానికి నామినేషన్లు వేశారు. ఇక వార్డు సబ్యుల నామినేషన్ లలో ముష్టిబండ లో 5 వార్డులకు ,దమ్మపేట లో 1, మొద్దులగూడెం లో 1 మొత్తంగా 7మంది వార్డు సబ్యులకు నామినేషన్లు దాఖలు చేశారు.

## మద్దెల ఆధ్వర్యంలో తోట దేవి ప్రసన్నకు సన్మానం



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమించబడిన తోట దేవి ప్రసన్నను భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం అభ్యుదయ కళాసేవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరిచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల మాట్లాడుతూ తోట దేవి ప్రసన్నకు దక్కిన ఈ ప్రతిష్టాత్మకమైన పదవిని పేద వర్గాల వారికి మహిళల సంక్షేమం కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను పెంచడం కోసం వినియోగించాలని సూచించారు. దేవి ప్రసన్న భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానాలను అధిరోహించాలని అందుకు కావలసిన శక్తి సామర్థ్యాలను ఆమెకు దేవుడు ప్రసాదించాలని పేర్కొన్నారు. ఇంత గొప్ప పదవిని కట్టబెట్టిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఆచార్య డాక్టర్ మద్దెల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తోట దేవి ప్రసన్న, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ లతోపాటు సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపర బాలు అల్లి శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉపాధ్యాయ ఉద్యమాల యోధుడు డి.సుధాకర్, సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బడికల పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ ఎన్నిక



**టేకులపల్లి - మహా:** మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నూతన కమిటీ అధ్యక్షునిగా తౌడోజు బిక్షమయ్యను ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా అధ్యక్షులుగా ఎన్నుకొని, ప్రధాన కార్యదర్శిగా నోముల భాస్కరాచారి, గత కార్యవర్గ కమిటీని కొనసాగించారు. ఎన్నికైన కమిటీ సభ్యులు బ్రహ్మంగారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టేకులపల్లి విశ్వబ్రాహ్మణులు. ధర్మపురి వీర బ్రహ్మాచారి, చంద్రగిరి రాధాకృష్ణ, కట్టుకోజ్వాల సురేష్ , చిలకమర్రి రామకృష్ణ, అన్నవరపు వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి బ్రహ్మాచారి, ఉరిమెల్ల యాదాచారి, ఆకారపు స్వప్న, గుంతోజు కృష్ణ, వజ్రాల పరిపూర్ణ చారి, మోత్కూరి రామాచారి, గజ్జల రామ్మోహన్ చారి, వెనగంటి రవీందర్, బౌరోజు బిక్షమయ్య, పంతంగి శ్రీను,నోముల భానుచందర్ పాల్గొన్నారు.

## బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని నామినేషన్



**దమ్మపేట, మహా:** స్థానిక పంచాయతీ ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా పల్లపు శిరీష ఆదివారం మండల కేంద్రంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఎన్నిక అధికారిణి అక్షిత కు నామినేషన్ పత్రాలను అందించారు. కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను పంచాయతీ అభివృద్ధి కోసం మంజూరు చేయించకలిగే సత్తా ఉన్న బిజెపి బలపరిచిన అభ్యర్థి గా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నట్లు శిరీష తెలిపారు. నామినేషన్ సమర్పించే సమయంలో ఆమె వెంట బిజెపి మండల అద్యక్షులు పల్లపు వెంకటేశ్వరరావు ,నాయకులు దారా నాగేశ్వరరావు ,తంబళ్ళ రవి ,నాగరాజు ,గుప్తా తదితరులు ఉన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



**దమ్మపేట, మహా:** మండలంలో రెండవ ఫేజ్ లో కొనసాగనున్న పంచాయతీ ఎన్నికల కు 10 నామినేషన్ కేంద్రాలను సహాయ ఎన్నికల అధికారి ,యంపిడివో రవీంద్రారెడ్డి ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నామినేషన్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తుగా పోలీసు బందోబస్తు స్థానిక యస్.ఐ.సాయికిషోర్ రెడ్డి ఆద్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆదివారం నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లను మండలంలో పర్యటించి ,పర్యవేక్షించారు. అన్ని కేంద్రాల వద్ద పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## కారేపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**కారేపల్లి, మహా:** కారేపల్లి అమ్మ హాస్పిటల్ ఆధ్వర్యంలో కారేపల్లి హైస్కూల్‌లో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి రోగులు తరలి వచ్చారు. చిన్నపిల్లల వైగ్య నిపుణులు డాక్టర్ అజ్మీర భగత్‌సింగ్, ఎముక కండరాల వైద్య నిపుణులు డాక్టర్ అజ్మీర సుభాష్‌చంద్రబోస్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ అజ్మీర దీపిక రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణి చేశారు. షుగర్, బీపీ, బోన్‌విక్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ అజ్మీర భగత్‌సింగ్ మాట్లాడుతూ అందరికి అందుబాటులోని కారేపల్లిలో అన్నిసౌకర్యాలతో అమ్మ హాస్పిటల్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం వంటి పట్టణాలకు వెళ్లకుండానే అధునిక పరికరాలతో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో తుడుందెబ్బ



**దమ్మపేట, మహా :** స్థానిక ఎన్నికల లో తుడుందెబ్బ ఆదివాసి సంఘం తమ సత్తా చాటాలనే ఉద్దేశం తో నామినేషన్ లు దాఖలు చేశారు. ఈ క్రమంలో ఆదివారం మండల కేంద్రంలో మేజర్ పంచాయతీ లోని 8 వ వార్డుకు బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిగా సున్నం శ్రీనివాస్ నామినేషన్ వేశారు. వార్డు సభ్యునిగా మొదలయ్యే తుడుందెబ్బ సంఘం మునుముందు మరెన్నో రాజకీయ పోటీలలో ముందుకు సాగుతామని ఆయన తెలిపారు. పంచాయతీ పరిదిలో ఆదివాసులకు న్యాయం చేయాలనే సంకల్పంతో ముందడుగు వేస్తున్నట్లు పేర్కొన్నారు.

## వెంకిట్యాతండాలో ఘనంగా ఇరుముడి



**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలం వెంకిట్యా తండాలో ఆదివారం అయ్యప్పమాలధారుల ఇరుముడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 41 రోజుల మండల దీక్షను పూర్తి చేసుకున్న అయ్యప్పమాల ధారులు వెంకిట్యాతండా సీతారామాంజనేయ ఆలయంలో ఇరుముడి కట్టు వేడుకను జరిపారు. గురుస్వాములు శివ, బానోత్ బాలు స్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి వేడుక నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానంను మాజీ జడ్పీటీసీ బానోత్ దేవ్లానాయక్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బానోతు భూలీ, వాంకుడోత్ కృష్ణ, గుగులోత్ కృష్ణ, గ్రామపెద్దలు గుగులోత్ శోభన్, గుగులోత్ నరేందర్, గుగులోత్ రమేష్, బానోత్ లెనిన్, వాంకుడోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నామినేషన్, స్రూటిని ప్రక్రియలను పరిశీలించిన ఎలక్షన్ అబ్జర్వర్



**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపహాడ్ మండలంలో గ్రామ పంచాయితీల ఎన్నికల సందర్భంగా నామినేషన్, స్కూటినీ ప్రక్రియల పారదర్శక నిర్వహణను సమీక్షించేందుకు ఎలక్షన్ ఎక్స్ పెండిచర్ అబ్జర్వర్ లావణ్య ఆదివారం మండలంలో పర్యటించారు. ఆదివారం మండలంలోని మోరంపల్లిబంజర్, బూర్గంపహాడ్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామ పంచాయితీలలో నిర్వహించిన స్కూటీ ప్రక్రియను పరిశీలించి, ఎన్నికల సంబంధిత నిబంధనలు, షెడ్యూల్ ప్రకారం నిధుల ఖచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జములారెడ్డి, ఎంపీవో సునీల్ కుమార్, ఎన్నికల బృంద సభ్యులు పాల్గొన్నారు.

# బ్లడ్ రోడ్స్!



- అతివేగమే హంతకుడు
- 11 నెలల్లో 781 ప్రమాదాలు, 279 మరణాలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రక్తమోడుతున్న రోడ్లు!
- ఈ ఏడాది 279 కుటుంబాల్లో చీకటి నింపిన రోడ్డు ప్రమాదాలు
- పెరుగుతున్న గణాంకాలు.. భద్రత గాల్లో దీపం
- రోడ్డుపై నరకం చూపిస్తున్న డ్రైవర్ల నిర్లక్ష్యం

**ఖమ్మం బ్యూరో, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం రోడ్డు భద్రత అనేది తీవ్రమైన చర్చనీయాంశంగా మారింది. జిల్లా రోడ్లు ఇప్పుడు ‘రక్త దారుల’ను తలపిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ 25వ తేదీ వరకు నమోదైన రోడ్డు ప్రమాదాల సంఖ్య దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం, 11 నెలల వ్యవధిలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 781 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ దుర్ఘటనల కారణంగా దాదాపు 279 మంది అమాయక ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ గణాంకాలు కేవలం సంఖ్యలు మాత్రమే కాదు, ప్రతి సంఖ్య వెనుక ఒక చితికిపోయిన కుటుంబం, తీరని లోటు, శాశ్వత విషాదం దాగి ఉంది. ఈ పరిస్థితిని చూస్తుంటే, అధికారులు, వాహనదారులు రోడ్డు భద్రతను ఎంత నిర్లక్ష్యం చేస్తున్నారో స్పష్టమవుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రోడ్డు ప్రమాదాల తీరు ఆందోళనకరంగా ఉంది. ఈ 781 ప్రమాదాలలో 261 ఘోరమైన మేజర్ యాక్సిడెంట్లు కాగా, 408 చిన్న ప్రమాదాలుగా నమోదయ్యాయి. ఈ మేజర్ ప్రమాదాల్లోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. జిల్లా కేంద్రం నుంచి అనుసంధానమయ్యే హైవేలపై, ముఖ్యంగా రాత్రి వేళల్లో, ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్నాయి. కేవలం ఖమ్మం జిల్లాలోనే కాక, పక్కనే ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కొత్తగూడెం జిల్లాలో ఈ సంవత్సరం 483 ప్రమాదాలు జరగగా, ఇందులో 213 మంది మృత్యువాత పడ్డారు. ఉమ్మడి జిల్లాలో ఐదు వందలకు పైగా ప్రాణాలు గాల్లో కలిసిపోయాయంటే, రోడ్లపై ప్రయాణం ఎంత ప్రమాదకరంగా మారిందో అర్థమవుతుంది.



### ప్రమాదాలకు కారణమవుతున్న డ్రైవర్ల నిర్లక్ష్యం

ఈ ఘోర ప్రమాదాలకు ప్రధానంగా మూడు అంశాలు కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు. మొదటిది, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను అతివేగంగా నడపడం. హైవేలపై కారు లేదా బస్సు నియంత్రణ కోల్పోయి, ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టడం లేదా రోడ్డు పక్కకు దూసుకెళ్లడం సర్వసాధారణమైంది. రెండవది, ర్యాష్ డ్రైవింగ్, ముఖ్యంగా ఓవర్ టేక్ చేసే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడం. లారీలు, బస్సులు వంటి భారీ వాహనాలు సైతం చిన్న వాహనాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడవది, మద్యం మత్తులో వాహనాలు నడపడం. వీరు కేవలం తమ ప్రాణాలకే కాదు, రోడ్డుపై ప్రయాణించే పదుల సంఖ్యలో ఉన్న ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగిస్తున్నారు. చిత్రాలలో మనం చూసిన విధంగా బస్సులు, కార్లు నుజ్జునుజ్జు కావడం, ఆటో రిక్షాలు రోడ్డుపై బోల్తా పడటం వంటి దృశ్యాలు డ్రైవర్ల నిర్లక్ష్యానికి నిదర్శనం.

### తక్షణమే భద్రతపై దృష్టి పెట్టాల్సిన అవసరం

ఈ విశ్లేషణకు ప్రాథమికంగా రోడ్ల దుస్థితి కూడా కొంతవరకు కారణమని చెప్పవచ్చు. కొన్ని ప్రాంతాల్లో గుంతల రోడ్లు, రోడ్లపై హెచ్చరిక బోర్డులు లేకపోవడం, మరియు ముఖ్యంగా పగటిపూట నిఘా కొరవడటం వల్ల ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ప్రమాదాల తీవ్రత, దాని వల్ల సంభవిస్తున్న ప్రాణనష్టం దృష్ట్యా ప్రభుత్వం మరియు పోలీసు శాఖ వెంటనే స్పందించాలి. రోడ్లపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను విస్తృతం చేయడంతో పాటు, స్పీడ్ గన్స్‌తో నిఘాను పెంచాలి. వాహనదారులలో భద్రతా చర్యలపై కఠినమైన అవగాహన కల్పించకపోతే, ఈ రక్త దారుల్లో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉంది. ప్రజలు తమ ప్రాణాలను రక్షించుకోవాలంటే, నిబంధనలు పాటించడం , బాధ్యతాయుతమైన డ్రైవింగ్ మాత్రమే ఏకైక మార్గం.

## ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయండి



**కల్లూరు,మహా:** ప్రభుత్వ పాఠశాలల పరిరక్షనే ధ్యేయంగా మండల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టి.ఎస్.యు.టి.ఎఫ్) ఆధ్వర్యంలో 21 మండలాల నుండి సుమారు 800 మంది ఉపాధ్యాయులతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభలో ఉపాధ్యాయుల డిమాండ్లలో భాగంగా తెలంగాణ రాష్ట్ర టీ.ఎస్.యు.టి.ఎఫ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలపు వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి ఉన్నత ప్రమోషన్ పొందడానికి టెట్ రాత పరీక్షకు సడలింపు విధించాలని, ఉపాధ్యాయుల జనరల్ ఫండ్ ను అవసరాల నిమిత్తం వినియోగించుకునే విధంగా వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకోవడానికి ఉపయోగపడే వనరులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయదని, ఉపాధ్యాయుల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి నివృత్తి చేసే విధంగా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏ.ఎం.సి చైర్మన్ భాగం నీరజ, సత్తుపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ తోట సుజల రాణి తదితరులు పాల్గొన్నారు.




# క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



- క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత
- సింగరేణి చైర్మన్ బలరాం
- గెలుపొందిన విజేతలకు బహుమతులు
- విజయవంతంగా ముగిసిన కబడ్డీ పోటీలు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** క్రీడా పోటీలతో సంపూర్ణ ఆరోగ్యం లభించడంతో పాటు ఉత్సాహాన్నిస్తుందని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం అన్నారు. సింగరేణి కాలరీస్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రుద్రంపూర్ ప్రొఫెసర్ జయ శంకర్ స్టేడియం నందు మూడు రోజులపాటుగా జరిగిన కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగరేణి చైర్మన్ ఎన్.బలరామ్ హాజరై విజేత టిమ్ లకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ విజయ వంతంగా నిర్వహించుకోవటం చాలా సంతో షంగా ఉందన్నారు. గత మూడు రోజులుగా నిర్వహించిన పోటీలలో 8 అనుబంధ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కబడ్డీ జట్టు క్రీడాకా రులు పాల్గొన్న ఈ కబడ్డీ పోటీలలో క్రీడాకా రులు అందరూ అద్భుతమైన క్రీడాస్ఫూర్తితో పాల్గొన్నారని పేర్కొన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజం అని తెలిపారు. కోల్ ఇండియా అనుబంధ సంస్థలు క్రీడకారులను ఎంతగానో పోత్సహిస్తూ దేశ వ్యాప్తముగా ఆటల పోటీలను నిర్వహిస్తూ క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. క్రీడలలో పాల్గొనటం వలన శరీరకముగా గానే కాకుండా మానసికంగా కూడా చాలా దృఢంగా ఉంటారని తెలుపుతూ పోటీలలో గెలుపొందిన డబల్యూసి ఎల్, సింగరేణి ఎస్ఈసిఎల్ క్రీడాకారులను అభినం దించారు. కబడ్డీ పోటీలలో డబల్యూసిఎల్ విజేతగా నిలువగా, సింగరేణి సంస్థ టీం మొదటి రన్నర్ గా ఎస్ఈసింఎల్ రెండవ రన్నర్ గా నిలిచిన టీంలకు సంస్థ చైర్మన్ ట్రోఫీలను అందజేసి క్రీడాకారులకు శు భాకాంక్షలు తెలిపారు. బహుమతుల ప్రధానం అనంతరం ఒలంపిక్ పతాకాన్ని అవనతం చేసి కబడ్డీ పోటీల కార్యక్రమాన్ని ముగించారు. జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు అధ్యక్షతన జరిగిన ఈ కబడ్డీ ఆటల పోటీలలో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్ తో పాటుడైరక్టం్(ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారా యణ, డైరెక్టర్(ఈ అండ్ ఎం)ఎం. తిరుమలరావు, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) ప్రెసిడెంట్ వి.సీతారామయ్య, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్టియూసి)సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్, సిఎంఓఏఐ బిఈసి జాయింట్ సెక్రటరీ రాజ గోపాల్, కొత్తగూడెం ఏరియా సిఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎం.వి.నరసింహా రావు, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జివి.కిరణ్ కుమార్, జిఎం( ఫైనాన్స్) ఎం.సుబ్బారావు, ఎస్ఓటు జిఎం జివి.కోటి రెడ్డి, ఏరియా ఇంజనీర్ కే.సూర్య నారా యణరాజు, ఏజిఎం(సివిల్) సిహెచ్.రామ కృష్ణ, డిజిఎం (పర్సనల్)లు జీవి.మోహన్ రావు, కేసా నారాయణరావు, వైవిఎల్.వరప్రసాద్, బి.శివ కేశవరావు, కొత్తగూడెం ఏరియా గుర్తింపు సంఘం(ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ వి.మల్లికార్జునరావు, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, కొత్తగూడెం ఏరియా అధికారుల సంఘం జనరల్ సెక్రెటరీ ఎ.ఉపేంద్ర బాబు, అధికారులు, యూనియన్ నాయకులు, స్పోర్ట్స్ మేనేజర్ కే.సునీల్ కుమార్, సూపర్వైజర్ లు, పర్సనల్, ఎస్ అండ్ పిసి, ఈ అండ్ఎం క్రీడాకారులు పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల పర్వం

**మహా,పినపాక:** మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం శనివారంతో ముగియగా ఆదివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు 23 గ్రామపంచా యతీల పరిధిలోని దాఖలైన



నామినేషన్లను పరిశీలించారు. సీతారాంపురం గ్రామపంచాయతీ లోని ఒక వార్డు నామినేషన్, భూపాలపట్నం గ్రామపంచాయతీలో ఒక వార్డు నామినేషన్, ఈ బయ్యారం గ్రామపంచాయతీలో ఒక వార్డు నామినేషన్ , అలాగే పొట్లపల్లి పంచాయితీలో ఒక సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ పత్రాన్ని పలు కారణాలతో తిరస్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో మండలంలోని 23 గ్రామ పంచాయతీల నుండి 118 సర్పంచి అభ్యర్థులు, 526 మంది వార్డు సభ్యుల నామినేషన్లను సరైనవిగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

## సీఈఐఆర్ సేవలతో మొబైల్ ఫోన్ల రికవరీ

**పినపాక,మహా:** పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ ( సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిఫై రిజిస్టర్) సేవల ద్వారా రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరుగుతుందని ఈ



బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఈ బయ్యారం పోలీస్ స్టేషన్ ఆవరణలో బాధిత విద్యార్థులకు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ ఆద్వర్యంలో పోలీసు కమాండ్ కంట్రోల్ లో రికవరీ చేసిన మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న ఇంటర్ విద్యార్థులకు అందజేయడం జరిగిందని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ వారి వారి మొబైల్ ఫోన్లను వారికి పోలీస్ స్టేషన్లో అందజేశారు.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు:ఎస్సై వీరేందర్

**చింతకాని ,మహా:** సోషల్ మీడియా ద్వారా సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని చింతకాని ఎస్ఐ వీరేందర్ హెచ్చరించారు.స్థానిక సంస్థల ఎన్నికలపై శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.బి బిఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరంగా కఠిన




చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఏదైనా పోస్టులు, వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నటలు చెప్పారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు హాని కలిగించవద్దన్నారు.

## సిపిఐ అభ్యర్థులను గెలిపించండి

**జూలూరుపాడు, మహా:** స్థానిక ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ ఓటర్లను కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎన్.వి.ఆర్ ఫంక్షన్ హాల్ లో బెజవాడ సీతయ్య అధ్యక్షతన జరిగిన



సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కలిసి వచ్చే పార్టీలతో సిపిఐ పొత్తులు కొనసాగించి మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కమ్యూనిస్టు నాయకులను ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవడం వల్ల ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన అన్నారు. మండల వ్యాప్తంగా 24 గ్రామ పంచాయతీలలో సిపిఐ కలిసొచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, ఎల్లంకి మధు, సిరిపురం వెంకటేశ్వర్లు, పొన్నకంటి వెంకటేశ్వర్లు, గుండె పిన్ని మధు, తూము కోటయ్య, వల్లమల్ల సామేలు, గార్లపాటి వీరభద్రం, పాలేపు ప్రభాకర్, భూక్య శంకర్, ఉదారి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# తుమ్మలతో తాటి భేటి

- రాజకీయంలో పెనుమార్పులు..?
- సియం సమక్షంలో కాంగ్రెస్ లోకి..?
- సుదీర్ఘ చర్చల వెనుక దాగి ఉన్న రహస్యం ఏంటి..?

**దమ్మపేట ,మహా :** ఓమాజీ శాసనసభ్యులు ,ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు ఆదివారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను మర్యాద పూర్వకంగా గండుగులపల్లి లోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట లో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై ఆయన తుమ్మలకు వివరించారు. ఐతే ఈ కలయిక వెనుక రాజకీయ ప్రాధాన్యత ఏ మాత్రం దాగి ఉందనే అంశంపై " మహా " ఆరా తీయగా చాలా విలువైన అంశాలు వెలుగు చూశాయి. మంత్రి కి అతి సమీప సన్నిహితులనుండి సేకరించిన సమాచారం మేరకు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తీరు ఆపార్టీలోని కొందరు సీనియర్ నాయకులను రాజకీయంగా ఇబ్బందుల కు గురి చేస్తుందనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలోనే తాటి వెంకటేశ్వర్లు ఇటీవల అశ్వారావుపేట నియోజక వర్గ కేంద్రంలో తన అనుచరులతో బహిరంగ సమావేశం ఏర్పాటు చేసి బిఆర్ ఎస్ పై నిప్పులు చెరిగారు. దాంతో ఈ విషయం భద్రాద్రి జిల్లా బిఆర్ఎస్ అద్యక్షులు రేగా కాంతారావు దృష్టికి చేరింది. ఈ నేపద్యంలో మెచ్చాపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కాగా బిఆర్ఎస్ పార్టీలో ఎప్పటికైనా తాటి ని రాజకీయంగా ముందుకు సాగనివ్వరనే ఆలోచనతో తన ప్రియమైన రాజకీయ గురువును ఆశ్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. దాదాపుగా గంట సేపు సుదీర్ఘ చర్చల అనంతరం ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. స్వతహాగా టిడిపి లో భూర్గంపాడులో ఎమ్మెల్యే గా మొదటిసారి చేసినప్పటి నుండి తుమ్మలతో సత్సంబంధాలు కొనసాగించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పార్టీలు వేరైనా తుమ్మలతో రాజకీయ బందం మాత్రం ఎప్పటిలాగానే తాటి కొన సాగించినట్లు రాజకీయ విశ్లేషణలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా ఈ పరిణామాలు మరికొన్ని ఆసక్తి కర విషయాలను బహిర్గతం చేశాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ నెల రెండవ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తగూడెం పర్యటన సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు ,తుమ్మల అండదండలతో కలిసే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి కూడా పాత తెదేపా నాయకుడే గనుక తాటి పరిచయం అంతగా అవసరం లేని వ్యక్తి గా చెప్పవచ్చు. బిఆర్ ఎస్ లో బలమైన నాయకులు లేకుండా ,తన అభివృద్ధి ,సంక్షేమ పథకాల సహకారం తో నాయకుల ను ఆకర్షించే యత్నం ఇప్పటికే కాంగ్రెస్ చేపట్టిన కోణంలో ,తాజాగా ఆదివాసి నాయకుడు ,మాటకారి ,రాజకీయ చైతన్య వంతుడైన తాటిని సునాయాసంగా కాంగ్రెస్ లోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఐతే తుమ్మలతో కలిసి పనిచేయడంలో తాటికి ఎటువంటి సందేహం లేదనె విషయాన్ని ఇదివరకే తాటి పలుమార్లు ,పలు చోట్ల వ్యాఖ్యానించిన క్రమంలో ఈ తరహా వార్తలకు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుందని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.



# అఖండ భారత్ స్ఫూర్తితో దుబాయ్ ఎన్ఆర్ఐల ఆత్మీయ ఆతిథ్యం

- బీజేపీ కోశాధికారి వాసుదేవరావుకి ఘన సత్కారం
- తెలుగు ప్రాంత అభివృద్ధిలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకం
- దుబాయ్ వేదికగా పిలుపునిచ్చిన వాసుదేవరావు

**ఖమ్మం, మహా:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు దుబాయ్ పర్యటన సందర్భంగా, మొదటిసారిగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కు విచ్చేసిన ఆయనకు దుబాయ్‌లోని తెలుగు నాన్-రెసిడెంట్ ఇండియన్స్ ఆత్మీయత ఉట్టిపడే రీతిలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో, వాసుదేవరావు కి మహోన్నతమైన సన్మానం నిర్వహించి, అక్కడి తెలుగువారు తమ అభిమానాన్ని, గౌరవాన్ని సమున్నతంగా చాటుకున్నారు. ఈ సన్మాన కార్యక్రమం ఆయన దేశభక్తి, దైవభక్తితో కూడిన ప్రజాసేవకు, అలాగే స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా ఆయన అందిస్తున్న విశేష సామాజిక సేవకు లభించిన గుర్తింపుగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు కి దుబాయ్ పర్యటన మొదటి రోజునే చిరస్మరణీయమైన అనుభూతిని మిగిల్చింది. తెలుగు ప్రాంతం నుంచి వచ్చి దుబాయ్‌లో స్థిరపడిన ఎన్ఆర్ఐలు ఆయనకు అపూర్వ స్వాగతం పలికి, తెలుగు సంస్కృతి, దేశభక్తి కలగలిసిన వాతావరణాన్ని సృష్టించారు. ప్రవాస తెలుగువారు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం వాసుదేవరావు ప్రజాజీవితాన్ని, సామాజిక సేవను కొనియాడే వేదికగా మారింది. దేశభక్తిని, దైవభక్తిని ప్రధానంగా నమ్మే ఆయన, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల ద్వారా ఎంతోమందికి చేరువయ్యారు. ఈ నిబద్ధతకు నిదర్శనంగా దుబాయ్‌లో ఆయనకు జరిగిన సత్కారం, అక్కడి తెలుగువారికి ఆయన పట్ల ఉన్న గౌరవాన్ని, అభిమానాన్ని స్పష్టం చేసింది. సన్మానాన్ని



స్వీకరించిన అనంతరం వాసుదేవరావు ప్రసంగిస్తూ ఉద్వేగానికి లోనయ్యారు. "నన్ను ఇంతటి ఘనతతో సన్మానించిన ప్రతి తెలుగువారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీరు అందించిన ఈ అపూర్వ స్వాగతం నా జీవితాంతం గుర్తుండిపోతుంది," అని ఆయన అన్నారు. "ప్రజాసేవ కోసం, భారత మాత సేవ కోసం నేను మరింత శక్తి, నిబద్ధతతో పనిచేయడానికి మీ అందరి ఆశీస్సులు నాకు మహోన్నతమైన ప్రేరణ" అని పేర్కొన్నారు.

ఈ స్ఫూర్తిదాయకమైన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తెలుగు ఎన్నారైలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# హోరాహోరీ..!

**ఖమ్మం బ్యూరో, మహా:** పటిష్టమైన స్థానిక సంస్థల పాలన దిశగా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఉద్ధృతి తారాస్థాయికి చేరింది. ఖమ్మం జిల్లాలో తొలి విడత నామినేషన్ల ఘట్టం అసాధారణ రికార్డులను సృష్టించి, ఈ సమరం కేవలం ఎన్నిక కాదు, ప్రజాస్వామ్య మహా సంగ్రామం అని నిరూపించింది. ఈ ఉత్సాహం ఏమాత్రం తగ్గకుండానే, రెండో దశ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామాలలో కొత్త ఉద్రిక్తత, ఉత్సాహం చోటు చేసుకుంది. ఈ రెండవ దశ నామినేషన్ల ప్రక్రియ ఆదివారం నుంచి డిసెంబర్ 2 వరకు మూడు రోజుల పాటు జరగనుంది. ఈ స్వల్ప గడువు అభ్యర్థులలో ఒత్తిడిని, గ్రామీణ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన ఘట్టంగా విశ్లేషకులు భావిస్తున్నారు. తొలి విడతలో ఖమ్మం జిల్లాలో కనిపించిన అనూహ్య స్పందన, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పోటీ తీవ్రతను స్పష్టంగా సూచిస్తోంది.

## సర్పంచ్ బరిలో ఆరుగురికి పైగా అభ్యర్థులు

ఖమ్మం జిల్లా స్థానిక ఎన్నికల తొలి విడతలో సర్పంచ్ పదవులకు అభ్యర్థుల నుంచి అపూర్వ స్పందన లభించింది. తొలి విడతలో నోటిఫై చేయబడిన 192 గ్రామ పంచాయతీలకు గాను, నవంబర్ 29 నాటికి ఏకంగా 1,142 నామినేషన్లు నమోదయ్యాయి. కేవలం ఒక్క రోజు (29.11.2025) నాడు 884 నామినేషన్లు దాఖలు కావడం ఒక సంచలనం. దీనిని బట్టి చూస్తే, ఒక్కో గ్రామ పంచాయతీకి సగటున ఆరుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో నిలిచేందుకు మొగ్గు చూపడం, గ్రామ సర్పంచ్ కోసం ఈ సమరం ఎంత హోరాహోరీగా ఉండబోతోందో తెలియజేస్తోంది.

## హాట్‌స్పాట్స్‌లో యుద్ధ వాతావరణం

మండలాల వారీగా నామినేషన్ల దాఖలును విశ్లేషిస్తే, రఘునాథపాలెం మండలం అగ్రస్థానంలో నిలిచింది. ఇక్కడ 37 గ్రామ పంచాయతీలకు గాను, మొత్తం 254 నామినేషన్లు దాఖలయ్యాయి. దీనికి కొంచెం వెనుకనే కొణిజర్ల మండలం (27 జీపీలు) మొత్తం 194 నామినేషన్లతో నిలిచింది. సర్పంచ్ పదవులతో పాటు, 1,740 వార్డు సభ్యుల పదవులకు కూడా ఊహించని స్పందన కనిపించింది. మొత్తం నామినేషన్ల సంఖ్య 4,054కి చేరగా, చింతకాని మండలం (626 నామినేషన్లు), కొణిజర్ల (632 నామినేషన్లు) వార్డు ఎన్నికల్లో నయా హాట్‌స్పాట్‌లుగా మారాయి. ప్రతి స్థానానికి ఇద్దరికి పైగా అభ్యర్థులు పోటీ పడుతుండటం, క్షేత్ర స్థాయిలో ఈ ఎన్నికల పట్ల ఉన్న పట్టుదలను స్పష్టంగా చాటుతోంది.

## రెండో దశ ఎన్నికల హడావుడి..

తొలి దశ నామినేషన్ల సునామీ ముగియగానే, రెండో దశ ఎన్నికల వేడి మొదలైంది. ఈ దశలో మొత్తం 4,333 సర్పంచ్ స్థానాలు 38,350 వార్డు సభ్యులు ఎన్నిక కానున్నారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 2 వరకు మూడు రోజుల పాటు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. ఆదివారం రెండో దశ నామినేషన్ల ప్రక్రియలో భాగంగా, ఖమ్మం జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో 183 గ్రామ పంచాయతీలకు గాను 45 సర్పంచ్ నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే, 1686 వార్డులకు గాను 36 నామినేషన్లు నమోదయ్యాయి. ఈ నామినేషన్లలో సర్పంచ్ పదవులకు తిరుమలాయపాలెం (11 నామినేషన్లు), వార్డు సభ్యుల పదవులకు కామేపల్లి (10 నామినేషన్లు) మండలాలు ముందంజలో ఉన్నాయి. గ్రామాల్లోని కుల, వర్గ సమీకరణాలను తేల్చే ఈ కీలకమైన ఘట్టం కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు ఇప్పటికే వ్యూహ రచనలో నిమగ్నమయ్యారు.

## పకడ్బందీ ఏర్పాట్లు.. డిసెంబర్ 11న తుది తీర్పు

రెండో దశ నామినేషన్ల సమర్పణకు స్వల్ప గడువు ఉన్నప్పటికీ, జిల్లా ఎన్నికల యంత్రాంగం పారదర్శకంగా, సజావుగా ఈ ప్రక్రియను నిర్వహించడానికి సిద్ధంగా ఉంది. డిసెంబర్ 3న నామినేషన్ల పరిశీలన, 4న అభ్యంతరాలు/వినతులు స్వీకరణ ఉంటుంది. ముఖ్యంగా, డిసెంబర్ 11న పోలింగ్ అనంతరం వెంటనే ఫలితాలను ప్రకటించడం ద్వారా సర్పంచ్ స్థానాలు, వార్డుల భవితవ్యం తేలనుంది. ఖమ్మం జిల్లాలో తొలి దశలో కనిపించిన అసాధారణ స్పందన దృష్ట్యా, రెండో దశలో ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించడానికి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ పర్యవేక్షణలో యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ స్థానిక సంస్థల ఎన్నికలు తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.